

డీసీసీ బ్యాంకులో రుణ'మస్తు'

పంటల సాగుకు రైతులకు అవసరమైన పెట్టుబడి రుణాలను సకాలంలో అందిస్తూ వారి అభివృద్ధికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ) సహకారం అందిస్తోంది. - 8లో



పాస్‌పోర్ట్ సేవల్లో జిల్లాకు అగ్రస్థానం

జిల్లా పోలీస్ శాఖ ఘనతల పరంపర ఆ శాఖకు మరింత కీర్తిని ఆర్జించి పెడుతోంది. ఎస్.పి అశోక్ కుమార్ నేతృత్వంలో స్పెషల్ బ్రాంచ్ విభాగం వేగవంతంగా పాస్ పోర్ట్ సేవలందిస్తోంది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /25.5

జిల్లాలో సోమవారం 25.5 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

పీ ఫోర్.. ఛూ మంతర్!



- పీ4'.. ఓ బూటకం.. బాబు నాటకం!
- దాతల సహకారంతో పేదరికం పోతుందా?
- ప్రజలను పక్కదారి పట్టించే ఎత్తుగడ
- ఇది టీడీపీ పొలిటికల్ ప్రాజెక్టు ... మేధావుల విమర్శలు

కడప సెవెన్‌రోడ్స్ : పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్).. ముఖ్యమంత్రి మొదలు కిందిస్థాయి అధికారుల వరకు నిత్యం జపిస్తున్న మాట. నిరుపేదలను గుర్తించి దాతల సహకారంతో వారి పేదరికాన్ని పోగొట్టడమే పీ4 కార్యక్రమ లక్ష్యంగా ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. నిజానికిది ఓ మాయా పథకం. విద్య, వైద్యం, ఉపాధి, సాగునీటి ప్రాజెక్టులు .. ఇలా మౌలిక సమస్యలను గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 పేరిట ప్రజలను తప్పుదారి పట్టించే యత్నాలకు పాల్పడుతున్నారని మేధావులు విమర్శిస్తున్నారు. స్ట్రక్చరల్ ఎకనమిక్ పాలసీల్లో మార్పు రాకుండా దాతృత్వంతో పేదరికం ఎలా రూపుమాపగలుగుతారని ప్రశ్నిస్తున్నారు. ఇది అధికార టీడీపీ పొలిటికల్ ప్రాజెక్టు తప్ప మరొకటి కాదని స్పష్టం చేస్తున్నారు.

దాతల సహకారంతో నిరుపేదలను దారిద్ర్యం నుంచి వెలికి తీసుకురావడమే పీ4 కార్యక్రమ ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. పేదలను బంగారు కుటుంబాలని, దాతలకు మార్గదర్శకులనే ట్యాగ్ తగిలించారు. జిల్లాలో ప్రాథమికంగా 78 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయని అధికారులు సర్వేలో గుర్తించారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి ఆగస్టు 10 నాటికి తుది జాబితా రూపొందించనున్నారు. దాతల సహకారంతో వారి అవసరాలు తీర్చడం ద్వారా అభివృద్ధి పథంలోకి తీసుకువస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందు కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయదు. పేదలు-దాతలకు ఒక వేదిక సమకూర్చడం తప్ప ఇందులో ప్రభుత్వ పాత్ర ఏమీ ఉండదు. సాయం మీరు చేయండి....రాజకీయంగా పేరు మేము తెచ్చుకుంటామన్నది అధికార టీడీపీ ఉద్దేశ్యంగా కనబడుతోందని మేధావుల అభిప్రాయం. కేవలం దాతృత్వం వల్ల పేదరికం పోతుందనుకుంటే పొరపాటేనని చెబుతున్నారు. జిల్లాలో ఎన్నో దశాబ్దాలుగా ఛారిటబుల్ ట్రస్టులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో విలువైన సేవలు అందిస్తూనే ఉన్నా పేదరికం ఎందుకు పోలేదని ప్రశ్నిస్తున్నారు. మౌలిక సమస్యల నుంచి.. ఇచ్చిన హామీల నుంచి ప్రజలను పక్కదారి పట్టించే ఉద్దేశ్యం తప్ప ఇది మరొకటి కాదని అంటున్నారు.

నీతి అయోగ్, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 నివేదికల మేరకు వివరాలిలా ఉన్నాయి.

ప్రధాన రంగాలను విస్మరిస్తూ...

విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రధాన రంగాలను ఏమాత్రం పట్టించుకోకుండా దాతృత్వం ద్వారా పేదరికాన్ని పోగొడతామని చెప్పడం పూర్తిగా హాస్యాస్పదం. జిల్లా జనాభా 20.61 లక్షలు ఉండగా జననాలలో లింగ నిష్పత్తి ప్రతి 1000 మంది మగ శిశువులకు 779 మంది మాత్రమే ఆడ శిశువులు జన్మిస్తున్నారు. ప్రతి లక్ష లైవ్ బర్త్‌లకు 157 మాతృ మరణాలు సంభవిస్తున్నట్లు కడప జీజీహెచ్ సర్వే ద్వారా తెలుస్తోంది. ఇక ప్రతి 1000 లైవ్ బర్త్‌లకు 38 చొప్పున శిశు మరణాలు సంభవిస్తున్నాయని అధికారిక నివేదికల ప్రకారం తెలుస్తోంది.

పీడిస్తున్న రక్తహీనత



జిల్లాలో పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో రక్తహీనత ఒకటి. పోషకాహార లోపమే ఈ సమస్యకు కారణం. జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 11,662 మంది గర్భిణులను గుర్తించగా, అందులో 1568 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. నాన్ ప్రెగ్నెంట్ మహిళల్లో 56.1 శాతం మంది ఎనీమియాతో బాధపడుతున్నారు. ఇక 15-19 ఏళ్లలోపు మహిళల్లో 60.2 శాతం రక్తహీనత ఉంది. 6 నుంచి 59 నెలల వయస్సుగల పిల్లల్లో 60.6 శాతం రక్తహీనత ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. రక్షిత తాగునీరు, పారిశుధ్యం, వ్యాక్సినేషన్, క్లీన్ ఫ్యూయల్, గృహాలు, విద్యుత్, తదితర అనేక అంశాలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి.

పిల్లల్లో పోషకాహార లోపం



జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో రిజిష్టర్ అయిన పిల్లలు 1,05,499 మంది ఉన్నారు. 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లల్లో తీవ్ర పోషకాహార లోపంతో (ఎస్ఏఎం) బాధపడుతున్న వారు 1331 మంది, ఎంఏఎం పిల్లలు 4056 మంది ఉన్నారు. వయస్సుతగ్గట్టు ఎత్తు లేని (సివియర్ స్టంటెడ్) పిల్లల సంఖ్య 8024, మోడరేట్ 15,280 మంది ఉన్నారు. తీవ్ర బరువు తక్కువ పిల్లలు 1377, మోడరేట్ 7115 మంది ఉన్నారు.

బాల్య వివాహాలు



పేదరికం కారణంగా జిల్లాలో బాల్య వివాహాలు పెద్ద ఎత్తునే జరుగుతున్నాయి. 2012 నుంచి 2025 మధ్యలో 545 బాల్య వివాహాలను అడ్డుకున్నామని ఐసీడీఎస్ అధికారుల నివేదికలు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 399 ఉండగా, అర్బన్ ప్రాంతాల్లో 146 ఉన్నట్లు నివేదిక వెల్లడిస్తోంది. పీసీఎంఏ చట్టం కింద రిజిష్టర్ అయిన కేసులు మాత్రం 29 మాత్రమే. అధికారుల నివేదికల కంటే వాస్తవంగా జరుగుతున్న బాల్య వివాహాల సంఖ్య అధికంగానే ఉంది.

అక్షరాస్యత



జిల్లాలో అక్షరాస్యత శాతం 61.76గా ఉంది. ప్రీ ప్రైమరీ పాఠశాలలకు వెళుతున్న ఐదేళ్లలోపు పిల్లల శాతం 9.5 గా నమోదైంది. ఆరేళ్ల పైబడిన బాలికలు పాఠశాలలకు వెళుతున్నవారి శాతం 61.9గా ఉంది. పదేళ్లు, ఆపై వయస్సుగల బాలికలు 49 శాతం మాత్రమే పాఠశాలలకు వెళుతున్నారు. మొత్తంగా మహిళల అక్షరాస్యత శాతం 63.8గా నమోదైంది.

ఉపాధి కరువు



జిల్లాలో ఉపాధి లేక అనేక మంది సాంకేతిక, ఉన్నత విద్య అభ్యసించిన మీదట పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారు. విభజన హామీల్లోని కడప స్టీల్ ప్లాంటు నిర్మాణం ఇప్పటికీ శంకుస్థాపనకే పరిమితమైంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటైంది. జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అల్ డిక్సన్, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు వచ్చాయి. గోపవరం ప్రాంతంలో సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమ వంటివి మినహాయిస్తే చంద్రబాబునాయుడు గత పాలనలోనూ, ఇప్పుడు ఒక్క కొత్త పరిశ్రమ కూడా రాలేదు. పైగా కొప్పర్తిలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని అమరావతికి తరలించారు.

వ్యవసాయంపై నిర్లక్ష్యం



జిల్లాలో వ్యవసాయోగ్యమైన భూమి 3,05,954 హెక్టార్లు ఉంది. కాగా భూమి లేని నిరుపేదలు జిల్లాలో లక్షల్లో ఉన్నారు. ఇక ఎకరాలోపు భూమి ఉన్న పేదలు 1,89,804 మంది, ఎకరా నుంచి రెండుఎకరాల వరకు ఉన్న రైతుల సంఖ్య 95,797 మంది, 4 నుంచి 10 ఎకరాలు ఉన్న రైతుల సంఖ్య 52,726 మంది, పెద్ద రైతులు 474 మంది ఉన్నారు. వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంపై ఆధారపడే నేటికీ కొనసాగుతోంది. కేసీ కెనాల్ మినహాయిస్తే దశాబ్దాల క్రితం ప్రారంభించిన తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా లాంటి ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే వందేళ్లకైనా ప్రాజెక్టులు పూర్తి కావని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఇలా జిల్లా ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అరకొరగా అందుతోంది. యువతకు ఉపాధి బరువైంది. శిక్షణ నైపుణ్యాలు దొరకడమే గగనమైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో విచ్చలవిడి అవినీతి జరుగుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. రేషన్ కార్డు మొదలు ఆధార్ కార్డు దాకా.. చిన్న మార్పులు చేయాలన్నా పైసలివ్వాల్సిన పరిస్థితి ఉంది. ఇవేవీ పట్టించుకోకుండా.. సరైన మౌళిక వసతులు కల్పించకుండా పీ4 పేరుతో మభ్యపెట్టడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేని బాబు.. ఇప్పుడు పీఫోర్ పల్లవి ఎత్తుకున్నారని రాజకీయపరిశీలకులు తూర్పారబడుతున్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే



దాతృత్వానికి పరిమితులు ఉంటాయి. దాతృత్వం వల్ల మాత్రమే పేదరికం పోదు. ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో మార్పులు తీసుకొచ్చినపుడే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుంది. కానీ, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 పేరుతో ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు.

- ఎ.రామ్మోహన్‌రెడ్డి, సీపీఎం కడప నగర కార్యదర్శి

పీ4 చంద్రబాబు ఆడుతున్న నాటకం



పీ4 పేరుతో పేదరికాన్ని రూపుమాపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారు. అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ప్రజలకు దశాబ్దాలుగా ఎన్నో సేవలు అందించింది. నేడు ఆ సంస్థ లైసెన్స్ రద్దును వ్యతిరేకిస్తూ సేవ్ ఆర్‌డీటీ ఉద్యమాన్ని ప్రజలే నిర్వహిస్తున్నారంటే ఆ సంస్థ సేవలను మనం అర్థం చేసుకోవచ్చు. సేవలు, దాతృత్వం వల్ల పేదరికం పోయేటట్లయితే అనంతపురం జిల్లాలో పేదరికం ఉండరాదు.

- జి.వలరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐఎస్ఎఫ్

యువతకు ఉపాధి చూపాలి



జిల్లాలో నైపుణ్యం గల మానవ వనరులకు కొదవ లేదు. పరిశ్రమలు తీసుకురావడం వల్ల ఉపాధి లభిస్తుంది. అప్పుడు ఎవరి దాతృత్వంతో అవసరం ఉండదు. నాణ్యమైన విద్య, వైద్యం, నైపుణ్యాలు, ఉపాధి వంటి ప్రధాన అంశాలను విస్మరించి పీ4 పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు మభ్యపెట్టాలని చూస్తున్నారు.

- దేవిరెడ్డి ఆదిత్య, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

న్యూస్‌రీల్

31న ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఈ నెల 31న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మైక్రోబయాలజీలో పిహెచ్‌డి, నెట్/ స్లెట్ అర్హత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అర్హత ప్రమాణాలు ఉండి ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా అలానే సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ప్రిన్సిపల్ కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు yvu.edu.in ను సందర్శించాలని ప్రిన్సిపల్ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీకడప డిపోలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు డ్రైవర్లనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా డ్రైవర్లు 18 నెలలు అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ, మెడికల్ పూర్తయి ఫిట్ అయిన వాళ్లని విధుల్లోకి తీసుకుంటామని వివరించారు. ఆసక్తిగల డ్రైవర్లు బస్టాండులోని అసిస్టెంట్ మేనేజర్ గారి కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సి.అరుణ్ రాజ్‌పై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైన డేటా ఎంట్రీ ఆపరేటర్ వి.ప్రేమ్ కార్తీక్, డ్రైవర్ ప్రతాప్, అటెండర్ యు.రాజ్ కుమార్‌లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ తెలియజేశారు. వీరు కమిషనర్ లేని సమయంలో ఆయన క్యాంపు కార్యాలయంలో ప్లేయింగ్ కార్డ్స్ ఆడడంపై మీడియాలో వార్తలు రావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

చరిత్ర నిపుణుల కమిటీలో బాలకొండకు స్థానం

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్న డాక్టర్ బాలకొండ గంగాధర్ చరిత్ర నిపుణుల కమిటీకి ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీ నుంచి ఈ 27వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాశాఖ చైర్మన్ మధు మూర్తి పర్యవేక్షణలోడిగ్రీ మూడేళ్ల మేజర్, మైనర్ సబ్జెక్టుల సంబంధించి పాఠ్య ప్రణాళికను తయారు చేశారు. కొత్త పాఠ్య ప్రణాళికలో మన సంస్కృతిని, వారసత్వ చరిత్రను ఎలాంటి వివక్షత లేకుండా అన్ని విషయాలను చేర్చినట్లు డాక్టర్ బాలకొండ గంగాధర్ తెలిపారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సోమవారం విడుదల చేశారు. పులివెందుల జెడ్పీటీసీగా ఉన్న తుమ్మల మహేశ్వరరెడ్డి మృతి చెందారు. అలాగే ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ రెండుస్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈనెల 30న రిటర్నింగ్ అధికారి ఎలెక్షన్ నోటీసు, ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. అదేరోజు నుంచి ఆగస్టు 1వ తేది వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఆగస్టు 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల తిరస్కరణపై కలెక్టర్‌కు అప్పీలు చేసుకునేందుకు మూడవ తేది సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. 4వ తేది అప్పీళ్లను పరిష్కరిస్తారు. ఐదో తేది మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఆగస్టు 12వ తేది ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏదైనా కారణాల రీత్యా రీపోలింగ్ నిర్వహించాల్సి వస్తే 13వ తేది ఉదయం 7.00 గంటల వరకు సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుంది. 14వ తేది ఉదయం 8.00 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఆ కార్యక్రమం పూర్తయ్యాక ఫలితాలను ప్రకటిస్తారు.

సర్వేను విజయవంతం చేయాలి

– జిల్లా పశు సంవర్ధశాఖ జేడీ శారదమ్మ

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా పాడిరైతుల జీవన ప్రమాణాలపై జరుగుతున్న సర్వేను విజయవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ సూచించారు. ఆమె సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీ దాకా జరిగే ఈ సర్వేలో వెటర్నరీ సిబ్బంది అందరూ పాల్గొని ఆయా కుటుంబాలలో పాడి, గొర్రెలు, కోళ్ల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో అడిగి తెలుసుకోవాలన్నారు. అలాగే బ్యాంకు రుణాలు తీసుకున్నారా.. ప్రభుత్వ పరంగా ఏయే పథకాలు వర్తిస్తున్నాయి.. ఇంకా వారికి ఏమైనా పథకాలు అవసరమా అనే అంశాలపై సమగ్రసర్వేను చేసి ప్రొఫార్మాలో పొందుపరచాలని సూచించారు.

జాతీయ వినియోగదారుల కమిషన్ ప్రధాన కార్యదర్శిగా సురేష్

కడప కార్పొరేషన్: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బద్వేల్‌కు చెందిన బి. సురేష్ బాబును నియమించినట్లు ఆ కమిషన్ చైర్మన్ సాయి రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం అందుకు సంబంధించిన నియామకపత్రం, సభ్యత్వ సర్టిఫికెట్లను జిల్లా చైర్మెన్ కిషోర్ అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తనను కడప జిల్లా జనరల్ సెక్రటరీగా ఎన్నుకొన్న నేషనల్ చైర్మన్ సాయి రమేష్‌కు, స్టేట్ కోఆర్డినేటర్ మద్దెల. సురేష్ బాబు కు, డిస్ట్రిక్ట్ వైస్ చైర్మన్ సి. వి. సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారులు ఏదైనా వస్తువు కొని మోసపోతే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలన్నారు.జిల్లా నాయకులు ఉమామహేశ్వర్ రావు,సుబ్బారావు, చలపతి, శ్రీధర్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

- పట్టా భూమి, వంక పోరంబోకులో యథేచ్ఛగా రోడ్డు నిర్మాణం
- ప్రశ్నించిన పట్టాదారుడిపై దౌర్జన్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీడీపీ నేతల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. అధికారమే అండగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలు తమ పొలంలోకి వెళ్లేందుకు ఓ దళితుడికి చెందిన పట్టా భూమిలో, వంక పోరంబోకులో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇదేమిటని ప్రశ్నించిన పట్టాదారుడిపై దౌర్జన్యం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సమీపంలోని చెరువు నుండి గ్రావెల్ తవ్వకుని వంక పోరంబోకులో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె గ్రామంలో సర్వే నంబర్ 1255, 1256, 1270, 1272, 1273 లలో సుమారు 30 మీటర్ల వెడల్పు మేర సగిలేరు వరకు వంక పోరంబోకు స్థలం ఉంది. సదరు స్థలం సమీపంలో గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. సదరు భూములలోకి నేరుగా రోడ్డు వేయించుకోవాలనే ఉద్దేశంతో టీడీపీ నేతలు బరితెగించారు. అధికారుల అండదండలతో సమీపంలోని చెరువు నుంచి గ్రావెల్ తవ్వకుని వంక పోరంబోకులో రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో చెన్నంపల్లె గ్రామానికి చెందిన శీలిపెద్దచెన్నయ్య పేరుతో 1249/2, 1248/5, 1252/2, 1251/3 సర్వేనెంబర్లలో ఉన్న పట్టా భూమిలో సైతం రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ విషయమై శీలిపెద్దచెన్నయ్య కుమారుడు శీలి చెన్నయ్య నా పట్టాభూమిలో రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా రోడ్డు పనులు కొనసాగించారు.

పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

వంక పోరంబోకు, చెరువు పోరంబోకు స్థలాల్లో ఎవరైనా పనులు చేపట్టినా మట్టిని తవ్వినా ఆగమేఘాల మీద చర్యలకు ఉపక్రమించే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చిన్నకేశంపల్లె గ్రామంలో యథేచ్ఛగా చెరువులో మట్టిని తవ్వకుని వంక పోరంబోకు స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. అంతేకాకుండా చెన్నంపల్లె చెరువు నుంచి చిన్నకేశంపల్లె, పెద్దకేశంపల్లె మీదుగా సగిలేరు వరకు ఉన్న వంక పోరంబోకు స్థలాన్ని సర్వే చేయకుండా కేవలం కొద్ది మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల స్థలాల వద్ద మాత్రమే సర్వే చేసి హద్దులు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయమై గ్రామానికి చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా ఇటీవల చిన్నకేశంపల్లె గ్రామంలో సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని, వంక పోరంబోకు స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. గ్రామానికి చెందిన కొందరు తమ పొలాలకు వెళ్లేందుకు రహదారి కావాలని కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపామని... ఇంతలోనే రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే పనులు నిలుపుదల చేస్తామన్నారు.



చిన్నకేశంపల్లె గ్రామంలో టీడీపీ నేతలు అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు

దౌర్జన్యానికి పాల్పడుతున్నారు



నా తండ్రి పేరు మీద చిన్న కేశంపల్లె గ్రామంలో ఉన్న 98 సెంట్ల పట్టా భూమిని 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా. ఇటీవల గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతలు తమ పొలాలకు వెళ్లేందుకు మా పట్టా భూమిలో రోడ్డు నిర్మిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. గతంలో కూడా టీడీపీ నేతలు చెన్నంపల్లెలో మాకు జీవనాధారంగా ఉన్న దుకాణాన్ని తొలగించారు.

- ఎస్.చెన్నయ్య, చెన్నంపల్లె

హెలీప్యాడ్ కోసం స్థల పరిశీలన

జమ్మలమడుగు : జమ్మలమడుగులో ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి సోమవారం హెలిప్యాడ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ముద్దనూరు రోడ్డులో ఉన్న పాలిటెక్నికల్‌కాలేజి ప్రాంతంలోని స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వరరెడ్డి ,గొనా పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు 'తిరుమల' కష్టాలు!

- రైలు ఒకటే... టికెట్లు రెండు కొనాలి
- విశాఖ నుంచి కడప వరకు ఎక్స్‌ప్రెస్‌గా.. కడప నుంచి గుంతకల్లు వరకు ప్రత్యేక ప్యాసింజర్‌గా రాకపోకలు



తిరుమల ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సాధారణంగా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా రైలులో ప్రయాణించ దానికి ఒక టిక్కెట్ కొనుగోలు చేస్తే సరిపోతుంది. 'తిరుమల ఎక్స్‌ప్రెస్'లో ప్రయాణించాలంటే రెండు టికెట్లు కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆశ్చర్యపోవద్దు.. ఇది నిజం. రైల్వేశాఖ తీసుకున్న వింత నిర్ణయం.

ప్రతిరోజు కడప-విశాఖపట్టణం-కడప మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును గతనెల 2వ తేదీనుంచి గుంతకల్లు వరకు పొడిగించారు. అంత వరకు బాగానే ఉన్నా ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు స్పెషల్ ప్యాసింజర్ రైలుగా నడపడం ప్రయాణికులను కష్టాలు తెచ్చి పెడుతోంది. విశాఖపట్టణం నుంచి కడపకు వచ్చిన తర్వాత ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు ప్రాంతాలకు వెళ్లాలంటే కడపలో మరో టిక్కెట్ తీసుకోవాల్సి వస్తోంది. అలాగే గుంతకల్లు నుంచి ఈ రైలులో గుంతకల్లు నుంచి కడప మీదుగా వెళ్లాల్సిన ప్రయాణికులు కడపలో దిగి మరో టిక్కెట్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణి కులు గమ్యాన్ని చేరుకునేందుకు ఒక రైలులోనే ఇలా రెండు టిక్కెట్లు కొనాల్సి వస్తోంది.

మహిళలు, వృద్ధులు, లగేజీతో వెళుతున్న వారి ఇబ్బందులు వర్ణణాతీతం

గుంతకల్లు నుంచి తిరుపతి, విజయవాడ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రైలులో గుంతకల్లు-కడప మధ్య జనరల్ టిక్కెట్ తీసుకుని, ఆ తర్వాత కడప నుంచి తాము వెళ్లే ప్రాంతం వరకు ఎక్స్‌ప్రెస్ టిక్కెట్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో టిక్కెట్ల కోసం కడప రైల్వేస్టేషన్‌లో దిగి మరో టిక్కెట్ కొనాల్సి వస్తోంది. రైల్వే అధికారుల నిర్ణయంతో మహిళలు, వృద్ధులు, లగేజీతో వెళుతున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేశాఖ నిర్ణయంతో పలుమార్లు ప్రయాణికులు ఘర్షణ పడిన సంఘటనలూ లేకపోలేదు. నేరుగా ఒకే టిక్కెట్టుపై ప్రయాణించే సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికుల రద్దీ మేరకు నిర్ణయం



ప్రస్తుతం కడప-గుంతకల్లు మధ్య స్పెషల్ ప్యాసింజర్‌గా తిరుగుతున్న రైలును ప్రయాణికుల రద్దీ పరిశీలన నిమిత్తం తిప్పుతున్నారు. ప్రయాణికుల ఆదరణ పెరిగితే భవిష్యత్తులో తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకు పొడిగిస్తారు. ప్రస్తుతానికి అన్ రిజర్వుడు ప్యాసింజర్‌గా నడుపుతున్న రైలులో కొద్దిరోజులపాటు ప్రయాణికులు ఇబ్బందులు తప్పవు. - జనార్దన్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, కడప



క్లుప్తంగా

గొట్లమిట్టలో పట్టపగలు చోరీ

చక్రాయపేట : మండల కేంద్రమైన చక్రాయపేట సమీపంలోని గొట్లమిట్టలో సోమవారం పట్ట పగలు చోరీ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక సర్పంచ్ మల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొట్లమిట్టకు చెందిన అన్నారపు సత్యనారాయణరెడ్డి, గంగమ్మ దంపతులు ఉదయం 11 గంటలకు ఇంటి తలుపులు వేసి గొర్రెలు మేపుకో వడానికి అడవికి వెళ్లారు. సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఈమధ్య సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప కడ్డీలు తీసుకు వచ్చి తలుపులకు వేసిన తాళాన్ని పగులగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంటిలో వారు దాచుకున్న రెండు జతల బంగారు కమ్మలు, జాలర్లు, ఒక ఉంగరంతోపాటు రూ.4వేల నగదును తీసుకెళ్లారు. ఇంటికి వచ్చిన సత్యనారాయణ రెడ్డి దంపతులు తలుపు వద్ద పడి ఉన్న కడ్డీలు పగులుకొట్టిన తాళాన్ని చూసి ఇంటిలోకి వెళ్లి చూడగా బంగారు వస్తువులు నగదు చోరీకి గురైనట్టు తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ సంఘటనకు సంబంధించి చక్రాయపేట పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



మృతి చెందిన నాగభూషణం

మైదుకూరు : మద్యం తాగి ఆ మత్తులోనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మైదుకూరులో జరిగింది. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన నల్లమారు నాగభూషణం(40) అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యపానం అలవాటు ఉన్న నాగభూషణం ఆదివారం రాత్రి మద్యం సేవించినట్లు తెలుస్తోంది. స్థానిక ఓ వైన్‌షాపు వద్ద మృతి చెంది ఉండగా సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సమాచారం ఇవ్వడంతో నాగభూషణం కుటుంబ సభ్యులు విలపిస్తూ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని అతని తల్లి నివాసం ఉంటున్న పట్టణంలోని చౌడేశ్వరి నగర్‌కు తరలించారు. మృతునికి భార్య ఉన్నారు. నాగభూషణం మృతిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అర్బన్ ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఏ ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఏ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : విభజన హామీ అమలులో భాగంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పాల్పడుతున్న అధిక ఫీజు దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

డీసీసీ బ్యాంకులో రుణ‘మస్తు’

- అన్నదాతలకు అండగా.. వ్యాపారులకు దన్నుగా
- 2025–26 ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం రూ. 807 కోట్లు
- వ్యవసాయానికి రూ.104.69 కోట్ల రుణాలు
- వ్యవసాయేతర రుణాలు రూ. 508.31 కోట్లు
- రూ. 194 కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా అడుగులు



కడపలోని డీసీసీ ప్రధాన బ్యాంకు

కడప అగ్రికల్చర్ : పంటల సాగుకు రైతులకు అవసరమైన పెట్టుబడి రుణాలను సకాలంలో అందిస్తూ వారి అభివృద్ధికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ) సహకారం అందిస్తోంది. రైతులతోపాటు వ్యాపారులు, డ్వాక్రా సంఘాలకు, హౌసింగ్ రుణాలు, వ్యక్తిగత రుణాలు, ఎడ్యుకేషన్ రుణాలతో పాటు పలు రకాల రుణాలను అందిస్తూ వారి అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుంటున్న రైతులు సకాలంలో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతన్నల పంటల సాగుకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బ్యాంకులు రుణాలను అందించనున్నాయి. ఈ తరుణంలో ఎవరెవరికి ఎంతెంత రుణాలను ఇవ్వాలనే లక్ష్యాన్ని డీసీసీ బ్యాంకు ఖరారు చేసింది. ఇతర బ్యాంకుల కంటే కొన్నింటిపైన తక్కువ వడ్డీతో రుణాలను అందించి వారి అభివృద్ధికి చేయూతనిస్తోంది.

ఈ ఏడాది లక్ష్యం రూ. 807 కోట్లు..

డీసీసీ బ్యాంకు తరపున జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ. 807 కోట్ల రుణాలను మంజూరు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వ్యవసాయ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారు ఆభరణాలు, వ్యవసాయేతర రుణాలతోపాటు డ్వాక్రా మహిళలకు రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో బంగారు ఆభరణాలపై రూ. 157 కోట్లు, పంట రుణాల కింద రూ. 69.94 కోట్లు, డ్వాక్రా సంఘాలకు రూ. 152.04 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ. 96.75 కోట్లు, రైతు నేస్తం కింద రూ. 46.81 కోట్లు, ఇతర రుణాల కింద రూ. 50 కోట్లు రుణాలను ఇవ్వనున్నారు. అలాగే వీటితోపాటు పలు రకాల రుణాల కింద మొత్తంగా రూ. 613 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. వీటితోపాటు డిపాజిట్ల కింద వివిధ వర్గాలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 194 కోట్లు సేకరించాలని బ్యాంకు వారు టార్గెట్ పెట్టుకున్నారు. అయితే డిపాజిట్లకు సంబంధించి 7.65 శాతం వడ్డీ ఇవ్వనున్నారు. ఇందులో సీనియర్ సిటిజన్లు చేసిన డిపాజిట్లకు 8.15 శాతం వడ్డీని చెల్లించనున్నారు.

కడపలో డీసీసీ బ్యాంకు ఏర్పాటు	1919 సంవత్సరం
కడప, అన్నమయ్య జిల్లాలు కలుపుకుని ఉన్న బ్రాంచులు	24
జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు	72
డీసీసీ బ్యాంకులో గత ఏడాది వరకు ఇచ్చిన మొత్తం రుణాలు	రూ.3276.29 కోట్లు
ఈ ఏడాది చివరి నాటికి చేరుకోనున్న లక్ష్యం	రూ.4083 కోట్లు

ఎలాంటి సిఫార్సులు లేకుండానే..



డీసీసీ బ్యాంకులో రుణాల మంజూరుకు ఎలాంటి సిఫార్సులు అవసరం లేదు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రుణాలను మంజూరు చేస్తాం. కమర్షియల్ బ్యాంకుల్లో లాగా మా బ్యాంకులో కూడా అన్ని రకాల రుణాలను అందిస్తున్నాము. రుణాలు కావాల్సిన వారు పత్రాలను తీసుకుని నేరుగా వచ్చి బ్యాంకు అధికారులను సంప్రదించవచ్చు. పరిశీలించి అర్హత ఉంటే రుణాలను మంజూరు చేయించుకోవచ్చు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాల్సి ఉంటుంది.

– రాజామణి, సీఈఓ(ఇన్‌చార్జి), డీసీసీ బ్యాంకు. కడప

పాస్‌పోర్ట్ సేవల్లో జిల్లాకు అగ్రస్థానం



అవార్డు పొందిన అధికారులను, సిబ్బందిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : జిల్లా పోలీస్ శాఖ ఘనతల పరంపర ఆ శాఖకు మరింత కీర్తిని ఆర్జించి పెడుతోంది. జిల్లా ఎస్.పి. ఈ.జి అశోక్ కుమార్ నేతృత్వంలో స్పెషల్ బ్రాంచ్ విభాగం వివిధ వృత్తులు, ఉపాధి, విద్య కోసం ఇతర దేశాలకు వెళ్లేవారికి సకాలంలో, వేగవంతంగా పాస్ పోర్ట్ సేవలందించినందుకు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2024 ఏప్రిల్ నుండి 2025 మార్చి వరకూ 46,532 పాస్ పోర్ట్ దరఖాస్తులను నిర్ణీత గడువులోపే విచారణ పూర్తిచేశారు. రాష్ట్రంలోనే అత్యుత్తమ పనితీరు కనబరచి గొప్ప విజయాన్ని జిల్లా పోలీస్ శాఖ అందుకుంది. విజయవాడ ప్రాంతీయ పాస్ పోర్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారి శివహర్ష చేతుల మీదుగా జిల్లా పోలీస్ విభాగం తరపున జిల్లా ఎస్.బి. విభాగం డీఎస్పీ ఎస్.సుధాకర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. ఈ.జి. అశోక్ కుమార్ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్. పురుషోత్తం రాజు, పాస్ పోర్ట్ వెరిఫికేషన్ యూనిట్ కానిస్టేబుల్ జి.సుబ్బరాజు, ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పాస్ పోర్ట్ దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించడం జిల్లా పోలీసుల అంకితభావానికి, కృషికి దక్కిన గౌరవమన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు జిల్లా ప్రజలకు సేవలందించేందుకు పునరంకితమవ్వాలని ఆయన ఆకాంక్షించారు.

నకిలీ పట్టాల కేసులో మరో ముగ్గురి అరెస్టు

బద్వేలు అర్బన్ : బద్వేలు అర్బన్ పోలీసు స్టేషన్‌లో నమోదైన నకిలీ పట్టాల కేసులో సోమవారం మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. అర్బన్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గోపవరం తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 19న బద్వేలు అర్బన్ పోలీసు స్టేషన్‌లో నమోదైన 251/2025 కేసులో గత మూడు రోజుల క్రితం పది మందిని అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరు పరిచామన్నారు. ఇదే కేసులో ప్రమేయం ఉన్న కలసపాడు మండలం పుల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన వీఆర్ఏ షేక్ అల్లాబకాష్, పట్టణంలోని మార్థోమా నగర్‌కు చెందిన వరపల్లె పెంచలయ్య (సూరేపల్లె వీఆర్ఏ), సుమిత్రా నగర్‌కు చెందిన ఎడ్రోమ్‌లను నెల్లూరు రోడ్డులో అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. నకిలీ పట్టాల కేసులో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని, త్వరలోనే వారిని కూడా అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరుస్తామని తెలిపారు.

ఈశ్వరీదేవి మఠానికి ఉత్సవ శోభ

నేడు అమ్మవారి జయంత్యుత్సవం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవిమఠం ఉత్సవ శోభ సంతరించుకుంది. అమ్మవారి జయంత్యుత్సవం సందర్భంగా మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మనుమరాలు శ్రీ ఈశ్వరీదేవి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. 1789లో సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా శ్రావణ శుద్ధ పంచమి నాడు అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున నుంచి సుప్రభాత సేవ, కలశతీర్థం, అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు, హోమాలు ఉంటాయి. అనంతరం అష్టోత్తర(108) కలశాలతో భక్తజనం ఊరేగింపుగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం వరకు వెళ్లి, పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ కమనీయంగా ఉంటుంది. రాత్రి ఊయలసేవ, గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా ఉంటాయి. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలను మఠాధిపతి వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఈఓ. బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులు



పోలీసుల సంరక్షణలో ఉన్న మహిళ

పుట్టపర్తి అర్బన్ : ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళను సకాలంలో పుట్టపర్తి రూరల్ పోలీసులు కాపాడారు. వివరాలు.. పులివెందులకు చెందిన సులోచన మానసిక స్థితి సరిగా లేక ఆదివారం రాత్రి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైపుగా ఉన్న బుక్కపట్నం చెరువు నీళ్లలోకి దిగింది. విషయాన్ని గమనించిన స్థానికుడు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పుట్టపర్తి రూరల్ పీఎస్ ఎస్ఐ లింగన్న ఆదేశాలతో కానిస్టేబుళ్లు రమేష్ బాబు, నరేంద్ర సకాలంలో అక్కడకు చేరుకుని నీటిలో మునిగిన ఆమెను కాపాడి వెలికి తీశారు. ఆమె నుంచి వివరాలు రాబట్టుకుని పులివెందులలోని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం ధర్మవరంలో ఉన్న ఆమె చిన్నాన్న రామాంజనేయులు పుట్టపర్తికి చేరుకుని బాధితురాలిని పిలుచుకెళ్లాడు.

వ్యభిచారం కేసులో జైలు శిక్ష

ప్రొద్దుటూరు క్రైం : వ్యభిచారం చేస్తూ పోలీసులకు పట్టుబడిన కేసులో మహిళకు ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 7 ఏళ్ల జైలు శిక్ష విధించింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు ప్రొద్దుటూరులోని వసంతపేటలో నివాసం ఉంటున్న మహిళ వ్యభిచారం చేస్తున్నారని సమాచారం రావడంతో 2015 జూలై 25న వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడిలో మహిళతో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఈ క్రమంలో సోమవారం తుది విచారణ జరుగగా నేరం రుజువు కావడంతో మహిళకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.12 వేలు జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తీర్పు చెప్పారు. ఈ కేసులోని మరో నిందితుడిని కోర్టు నిర్దోషిగా పరిగణించింది.

చెత్త పన్ను వసూలు చేసిన వారిపై చర్యలకు సిద్ధం

ముగ్గురు మేస్త్రీలు, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై వేటు.?

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో కమర్షియల్ షాపుల నుంచి యూజర్ చార్జీలు (చెత్త పన్ను) వసూలు చేసిన వారిపై చర్యలకు రంగం సిద్ధమైంది. దీనిపై రహస్యంగా విచారణ జరిపిన నగరపాలక అధికారులు బాధ్యులపైన చర్యలకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ మేస్త్రీలు, ఒక రెగ్యులర్ మేస్త్రీ, ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఒక ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లపై వేటు వేసే అవకాశాలున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూన్ 9 నుంచి చెత్త పన్ను వసూలు చేయకూడదని నిర్ణయించినప్పటికీ వీరు కమర్షియల్ షాపుల నుంచి చెత్త పన్ను యధావిధిగా వసూలు చేస్తూ, నకిలీ రసీదులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా వీరు ఎంతకాలంగా ఎవరెవరి నుంచి ఎంతెంత వసూలు చేశారనే దానిపై ఇంకా స్పష్టత వచ్చినట్లు తెలియడం లేదు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

మనస్థాపంతో యువతి ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు క్రైం : వాళ్లిద్దరూ ఒకరికొకరు ఇష్టపడ్డారు. ఆరేళ్లుగా కలసి తిరిగారు. ఈ క్రమంలోనే ఆ యువతి గర్భం దాల్చింది. పెళ్లి చేసుకోమని అడిగితే ప్రియుడు నిరాకరించాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన యువతి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతిలోని మత్స్యకాలనీకి చెందిన యువతి ఎంబీఏ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. యువతి కాలేజీలో చదివేటప్పుడు 2018లో గోపవరం పంచాయతీలోని కాల్వకట్ట సమీపంలో ఉన్న వినాయకనగర్‌కు చెందిన మహేశ్వరరెడ్డితో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్ల తర్వాత వారి పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో వివాహం చేసుకుంటానని నమ్మించి అతను 2019 నుంచి యువతితో సహజీవనం చేస్తున్నాడు. ఇలా చేయడం తప్పని యువతి పలుమార్లు అభ్యంతరం చెప్పినా ఇంట్లో మాట్లాడి తొందరలోనే పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో యువతి గర్భం దాల్చింది. యువతి ఈ విషయాన్ని మహేశ్వరరెడ్డికి చెప్పగా తన తల్లిదండ్రులతో మాట్లాడుతానని చెప్పాడు. పెళ్లి సమయంలో గర్భం ఉంటే ఫోటోలు సరిగా రావని చెప్పి యువతికి బలవంతంగా అబార్షన్ చేయించాడు. కొన్ని రోజుల తర్వాత కుమారుడి ప్రేమాయణం మహేశ్వరరెడ్డి తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో వారు యువతికి ఫోన్ చేసి నీచంగా మాట్లాడారు. ఈ విషయాన్ని మహేశ్వరరెడ్డికి చెప్పింది. తనకు పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని, అందుకే బలవంతంగా అబార్షన్ చేయించానని చెప్పాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన యువతి ఈ నెల 25న యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె పట్టణంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. యువతి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

VOCATIONAL COURSES

■ LM&D (డైరీయింగ్ & పశువిద్య), MLT, MPHW(F), C&T కోర్సులకు 2025 సం॥ అడ్మిషన్స్ జరుగుచున్నవి. అర్హత : 10th ఆపైన, హాస్టల్ కలదు. సెల్: 89855 66783.

SERIVCES

ASTROLOGY

■ ఉచిత జ్యోతిష్య పీఠం. ఆరోగ్య, కుటుంబ కలహాలు వ్యాపార అభివృద్ధి, స్త్రీ / పురుష వశీకరణం. మీకు ఏ విధమైన సమస్యలకైనా యంత్ర, మంత్రాలతో మూడు రోజులలో పరిహారం. Y. సురేష్ గురూజీ, సెల్: 9177882922.

మ్యారేజ్ బ్యూరో

■ శ్రీ మహాలక్ష్మి మ్యారేజ్ లింక్స్ D/–7/562–A4 NGO కాలనీ కడప వివాహ సంబంధంలకు,ఎంపిక మీది కుదిరించే బాధ్యత మాది 25 years అనుభవం గల, సంస్థ, సంప్ర:– 7899499023/6305581489

WANTED

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122

■ Wanted Teachers Physical Science -1, Personal Assistant-1 , Receptionist-1 Contact: 9154944970

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

■ Wanted Typist English & Telugu Typist Respectable Salary Location Proddatur Cell: 9966986952, 9390852381

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

రాష్ట్ర స్థాయి పోటీలకు డీఏవీ భారతి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

కమలాపురం : మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో ఉన్న డీఏవీ భారతి విద్యా మందిర్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. ఇటీవల విజయవాడలోని డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన 2025–26 క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో భారతి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. అండర్–17 విభాగంలో 4"400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో నరేష్, కార్తిక్ రెడ్డి, భార్గవ్, షారోన్ కుమార్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. చెస్ విభాగంలో లోహితేశ్వర్, రామ్ చరణ్, కౌశిక్, చక్రధర్ ప్రథమ స్థానంలో నిలిచారు. డిస్కస్‌త్రో, 800 మీటర్ల పరుగు పందెంలో నరేష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. 200 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌లో యతేశ్వర్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్–14 బాలికల విభాగంలో అస్మిత ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్–17 బాలికల విభాగంలో జావెలిన్ త్రోలో విహారిక ప్రథమ స్థానంలో నిలవగా, వైష్ణవి ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే జావెలిన్ త్రోలో షారోన్ కుమార్, రుషి, 400 మీటర్ల పరుగు పందెంలో విహారిక ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వివిధ ఈవెంట్లలో జశ్వంత్ రెడ్డి, అస్మిత, గురు కీర్తన తృతీయ స్థానాల్లో నిలిచారు. కాగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ వివరించారు. సోమవారం పరిశ్రమ సీఎంఓ సాయిరమేష్, హెచ్‌ఆర్ చీఫ్ గోపాల్‌రెడ్డి, ఐఆర్‌పీఆర్ చీఫ్ భార్గవ్‌రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి తదితరులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీ రామచంద్రను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు.

వికసిత భారత్. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాకారానికి కృషి

ఇరవై సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న ఇరవై సూత్రాల కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్

కడప సెవెన్‌రోడ్స్ : : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాకారానికి కృషి చేయాలని ఇరవై సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకరన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆకాంక్షిత జిల్లాలు, మండలాల కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు ప్రాజెక్టుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు తీరుపై వివిధ శాఖల అధికారులతో 20 పాయింట్ ప్రోగ్రామ్ చైర్మన్ లంకా దినకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘నీతీ ఆయోగ్’ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయడానికి కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. మన రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లా, పాడేరు మన్యం, పార్వతీపురం జిల్లాలను ఎంపిక చేశారని తెలిపారు. ముఖ్యంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్ – నైపుణ్యాభివృద్ధి, గృహనిర్మాణం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలు మొదలైన శాఖల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో మరింత పురోగతి సాధించాలని సూచించారు.

బెరైటీస్, ముగ్గురాయి మైనింగ్‌ల తనిఖీ



బక్కన్నగారిపల్లెలో బెరైటీస్ మైనింగ్‌ను తనిఖీ చేస్తున్న మైనింగ్, విజిలెన్స్ అధికారులు

వేంపల్లె : వేంపల్లి, వేముల మండలాల్లో ఉన్న బెరైటీస్ ముగ్గురాయి మైనింగ్‌లను మైనింగ్, విజిలెన్స్ శాఖల అధికారులు తనిఖీ చేశారు. సోమవారం వేంపల్లె మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామం వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌లను జిల్లా మైనింగ్ అధికారి వెంకటసాయి, విజిలెన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఇటీవల పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె, వేముల మండలాల్లో ప్రభుత్వానికి ఎలాంటి అనుమతులు, రాయల్టీలు చెల్లించకుండా కోట్ల రూపాయల ముగ్గు రాయిని కొల్లగొడుతున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్‌లకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది అధికారులు అక్రమార్కులకు అండగా నిలిచి దోపిడీలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. ఇటీవల వేముల మండలంలో ఎస్‌సీఎల్‌టీ ఆధీనంలో ఉన్న రూ.10 కోట్ల విలువ చేసే ముగ్గురాయిని రాత్రికి రాత్రే దొంగిలించారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తూతూ మంత్రంగా అధికారులు వచ్చి తనిఖీలు చేపట్టారు. అప్పటికే అక్రమార్కులకు అనుకూలంగా ఉన్న అధికారులు సమాచారాన్ని అందించడంతో మైనింగ్ పనులను చేయొద్దని చెప్పడంతో అక్రమార్కులు పనులను ఆపి వేశారు. వేంపల్లె, వేముల మండలాల్లో సుమారు పదిచోట్ల అక్రమ మైనింగ్ నడుపుతున్నట్లు సమాచారం. ఇటీవల వేంపల్లె మండలం కత్తులూరు గ్రామ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్ పనుల్లో వేముల మండలం అమ్మయ్యగారి పల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన రామచంద్ర మట్టి పెళ్లలు విరిగిపడి మృతి చెందాడని, ఇవన్నీ కూడా మైనింగ్, విజిలెన్స్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని పలువురు అంటున్నారు.

ఆరోగ్య బీమా విషయంలో వృద్ధుల అనాసక్తి

ఎల్‌వీపీఈఐ లాన్సెట్ పరిశోధనలో వెల్లడి



డాక్టర్ బ్రిజేష్ టక్కర్, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ నేత్ర వైద్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్య బీమా పొందేందుకు వృద్ధులు తగినంత శ్రద్ధ చూపించడం లేదని, వృద్ధులలో బీమా తీసుకోవడం చాల తక్కువగా ఉందని లాన్సెట్ అధ్యయన ప్రధాన రచయిత, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కన్సల్టెంట్ నేత్ర వైద్యులు డాక్టర్ బ్రిజేష్ టక్కర్, మరో అధ్యయన రచయిత డాక్టర్ రాజ్ నారాయణ్ పేర్కొన్నారు. క్యాటరాక్ట్ చికిత్స తర్వాత బీమా లేకపోవడం వలన దృశ్య మాన్యత తగ్గుతుందన్నారు. బీమా తీసుకోవడం వలన కంటి సంరక్షణ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. ఈ మేరకు ఎల్‌వీపీ ఈఐలో సోమవారం విడుదల చేసిన లాన్సెట్ పరిశోధన ఫలితాలపై వారు మాట్లాడుతూ భారత దేశంలో క్యాటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రతి 20 మంది వృద్ధులలో కేవలం ముగ్గురు మాత్రమే ఆరోగ్య బీమా కలిగి ఉన్నట్లు ప్రముఖ వైద్య పత్రిక లాన్సెట్ పరిశోధన వెల్లడించిందన్నారు. ఆరోగ్య బీమా తగినంత కవరేజ్ ఉన్నప్పుడు మాత్రమే మెరుగైన చికిత్స ద్వారా మంచి దృష్టి ఫలితాలను అందించేందుకు వీలవుతుందని తమ అధ్యయనం తెలుపుతుందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం కవరేజ్ ఉన్నప్పటికీ 80 ఏళ్లు పైబడిన వారు బీమా తీసుకోవటంలో అశ్రద్ధ కనబరుస్తున్నట్లు ఈ అధ్యయనం వెల్లడించిందన్నారు. ఈ అధ్యయనం 70 ఏళ్లు పైబడిన సాధారణ క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్న దేశంలోని నాలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక) నిర్వహించగా 38,387 మంది రోగులలో కేవలం 16.07 శాతం మంది మాత్రమే ఏదో ఒక రకమైన బీమా కవరేజ్ కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు ఉన్న బీమా విధానాలు అందుబాటులో లేనివిగా, భరించలేనివిగా, ఉపయోగకరమైనవి కానట్లుగా వృద్ధులు భావిస్తున్నారన్నారు.ఆయుష్మాన్ వంటి ప్రభుత్వ పథకాలు ప్రవేశ పెట్టడం ద్వారా బీమా తీసుకోవడాన్ని గణనీయంగా పెంచాయని, ఇది ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ సానుకూలతకు నిదర్శనం అన్నారు.

అవినీతి ఊబిలో కడప కేంద్ర కారాగారం

నేడు జైళ్లశాఖ డీజీ కడపకు రాక

కడప టాస్క్‌ఫోర్స్ : కడప కేంద్ర కారాగారం అవినీతి ఊబిలో కూరుకుపోయింది. అయినా బాధ్యులపై ఎలాంటి చర్యలు ఉండటం లేదు. ఎవరో ఒకరిని బలిపశువులను చేసి అసలు సూత్రధారులు, పాత్రధారులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పీడీ యాక్ట్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న జాకీర్ వద్ద గత ఆరు నెలలుగా దశలవారీగా 12 సెల్‌ఫోన్‌లు, ఒక ఛార్జర్ దొరికాయి. ఒకే ఖైదీ దగ్గర అన్ని సెల్‌ఫోన్‌లు లభించాయంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. జాకీర్ దగ్గర చివరిసారిగా ఈనెల 8వ తేదీన డిప్యూటీ సూపరింటెండెంట్ రమేష్ చేసిన తనిఖీలలో సెల్‌ఫోన్, మరుసటి రోజు చార్జర్ దొరికాయి. ఆ సమయంలో రమేష్ రికార్డ్ రాస్తామన్నా, సంబంధిత ఉన్నతాధికారి దాచిపెట్టే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఆ విషయం మరో వారం రోజులకు బయటకు పొక్కడంతో పత్రికల్లో ప్రచురితమైంది. తరువాత డీజీ ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేసి ఏడుగురిపై చర్యలు తీసుకున్నారు. చికెన్, మటన్, కూరగాయల సరఫరా వ్యవహారంలో నాణ్యతతో పాటు, ఒకే కాంట్రాక్టర్ ఏళ్లతరబడి నిర్వహిస్తూనే వుండటం గమనార్హం.

పెట్రోల్ బంకులో అవినీతి సమయంలోనూ, రిమాండ్ ఖైదీల దగ్గర ఫోన్‌పేల ద్వారా డబ్బులను వేయించుకున్న సంఘటనలలో డిప్యూటీ జైలర్ గాజుల మహమ్మద్ రఫీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డీఐజీ స్థాయి అధికారి అండదండలుండటమే ఇందుకు కారణమని పలువురు పేర్కొంటున్నారు. తన బాస్ బంధువులకు ‘విధేయత’గా ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న కొన్ని ఎకరాల భూమి, స్థలం విషయంలో తనవంతుగా ప్రయత్నాలను చేసినట్లు సమాచారం. ఆ స్థలం వ్యవహారంలో కడపకు చెందిన టీడీపీ ముఖ్యనేత, అతని అనుచరుడు కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేడు ప్రత్యేక విచారణ

కడప కేంద్ర కారాగారం పరిధిలో జరుగుతున్న అవినీతి, ఇతర కార్యకలాపాలపై ప్రత్యేక విచారణ చేసేందుకు జైళ్లశాఖ రాష్ట్ర డీజీ అంజనీకుమార్ మంగళవారం కడపకు రానున్నారు. సమగ్ర విచారణ అనంతరం మరుసటి రోజు ఆయన విజయవాడకు వెళతారని సమాచారం.

కేంద్ర కారాగారంలో అవినీతి జరగలేదు

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో ఎలాంటి అవినీతి జరగలేదని కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కె.రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన బాధ్యులెవరు–బాధితులు ఎవరు? అనే కథనంపై ఆయన స్పందించారు. జైలు అధికారులపై అవినీతి ఆరోపణలు అవాస్తవమన్నారు.